క్లుప్తంగా

28న ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాకారులు

రాజంపేట రూరల్ : మేటి కళాకరులచే 28వ తేదీన జీఎంసీలో ఉచిత పౌరాణిక నాటక ఘట్టమును ప్రదర్శిస్తున్నట్లు కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి తెలియజేశారు. స్థానిక జీఎంసీలో కళాకారులతో కలిసి నాటక ప్రదర్శన కరపత్రాలను ఆదివారం జబ్బిరెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ అన్నమాచార్య, మణికంఠ కళాకారుల ఐక్యవేదిక బృందం సహాయ సహకారాలతో ఈ నాటక ఘట్టాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలియజేశారు. రాత్రి 7గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు అందరూ ఆహ్వానితులేనన్నారు. కార్యక్రమంలో కళాకారులు యు.రామచంద్రారెడ్డి, ఎం.సుబ్బరాయుడు, ఎం.గంగయ్యనాయుడు, నాగభూషణం, సి.జయరామిరెడ్డి, ఎస్.కృష్ణయ్య, శివారెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఆకేపాటి

రాజంపేట : ఆకేపాడు పరిధిలోని అచ్చనపల్లెలో ఆదివారం వెంకట నర్సారెడ్డి కుమార్తె, అల్లుడుని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆశీర్వదించారు. వారి స్వగృహానికి ఆకేపాటి వెళ్లి వారిని ఆప్యాయంగా పలుకరించారు. నూతన వధూవరులను దీవించారు. ఈయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అనంతరం అచ్చనపల్లె గ్రామస్తులతో ఆయన మమేకమయ్యారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న అరవింద్

రాయచోటి జగదాంబ సెంటర్ : రక్తదానం చేయడం ఒక సామాజిక బాధ్యత అని అమానత్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు షేక్ అతావుల్లా తెలిపారు. రాయచోటి పట్టణం కొత్తపల్లికి చెందిన ఆయేషా అనే గర్భిణికి రక్తం (ఓ పాజిటివ్) అవసరం కాగా బంధువులు సంస్థ సభ్యులను సంప్రదించారు. స్పందించిన సంస్థ సభ్యులు మయానా మహ్మద్ అలీఖాన్ సహకారంతో అరవింద్ అనే యువకుడితో రక్తదానం చేయించారు. గర్భిణి బంధువులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.


నల్లగంగమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపించారు. ఆలయం ముందు భాగంలో బీజాక్షరాలతో కలిగి వున్న మహిమగల రాయిని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు

కడప రూరల్ : రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించడంతో పాటు కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై, మహానాడులో ప్రకటన చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవ్వారు మల్లిఖార్జున, జేవీ రమణ, ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం నిత్యం కరువు వలసలతో అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులకు నిధులను కేటాయించకపోవడం దారుణమన్నారు. కడప బెంగళూరు రైల్వే లైన్‌ను అమరావతి వరకు కొనసాగించాలని కోరారు. కడపలో సెంట్రల్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మహానాడులో రాయలసీమ డిక్లరేషన్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగని రైళ్లు.. ప్రయాణికులకు తప్పని అగచాట్లు

- ఓబులవారిపల్లెలో హాల్ట్ అవ్వని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- హరిప్రియ, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని స్థానికుల పట్టు
- విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డి
- స్పందన లేక ప్రయాణికుల అవస్థలు



గతంలో ఓబులవారిపల్లె స్టేషన్‌లో నిలిచి ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు



రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో జంక్షన్ పేరుకు సైతం నోచుకోని ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లోని బోర్డు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో దశాబ్దాలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఉండేవి. అయితే కోవిడ్ కారణంగా రైళ్ల పూర్తిగా రద్దు చేశారు. కోవిడ్ అనంతరం రైళ్లు పునరుద్ధరించినా స్టాపింగ్ కల్పించలేదు. గతంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అనేక సార్లు రైల్వేశాఖ అధికారులకు వినతిపత్రం ఇవ్వగా కంటితుడుపు చర్యగా హరిప్రియ ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించారు. అయితే ఆరునెలలకు ఒకసారి పూర్తిగా స్టాపింగ్ ఎత్తివేస్తూ వచ్చారు. ప్రస్తుతం రెండు రైళ్లను రద్దు చేసి రెండు నెలలు అయ్యింది. ఇక రైల్వే అధికారులు పునరుద్ధరించే ఆవకాశం లేనట్టుగా కనిపిస్తుంది.

రైల్వే అధికారుల తీరుతో ప్రజల అగచాట్లు...

మండలంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బెరైటీస్ గనులు, వందకు పైగా పల్వరైజింగ్ మిల్లులు ఉన్నాయి. ఇక్కడ పండించిన పంటలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. వాణిజ్యపరంగా ఎంతో మంది వ్యాపారులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇతర వర్గాల వారు దూర ప్రాంతలకు నిత్యం రైళ్లలో ప్రయాణాలు సాగిస్తుంటారు. రైల్వేశాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా తిరుపతి – నిజామాబాద్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్, తిరుపతి – కొల్హాపూర్ హరిప్రియ, తిరుపతి – కాచిగూడ – వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ పలుమార్లు స్టాపింగ్ ఎత్తివేయడంతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. కేవలం గంటకు 130 కిలోమీటర్ల వేగం పెంచడం కారణంగా స్టాపింగ్ తొలగించినట్లు రైల్వే వర్గాలు చెబుతున్నారు. ఓబులవారిపల్లె నుంచి నెల్లూరు కృష్ణపట్టణం రైలు మార్గం ఏర్పాటు చేసి దాదాపు ఐదు సంవత్సరాలు అయ్యింది. ఓబులవారిపల్లె జంక్షన్ అయ్యింది. అయితే బోర్డులో ఇప్పటికి కూడా ఓబులవారిపల్లె అని మాత్రమే ఉంది. ఇన్ని రోజులైనా కనీసం రైల్వే శాఖ వారు బోర్డులో పేరు కూడా మార్చలేదంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుంది.

పేరుకే జంక్షన్ ఒక్క ఎక్స్‌ప్రెస్ కూడా ఆగదు..

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన సొంత గ్రామం మీదుగా రైళ్ల ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఓబులవారిపల్లె – కృష్ణపట్టణం రైలు మార్గాన్ని ప్రారంభించి పూర్తి చేశారు.

అప్పటి నుంచి ఓబులవారిపల్లె జంక్షన్‌గా మారింది. జంక్షన్‌గా మారడంతో రైల్వే పరంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఉమ్మడి జిల్లా వాసులు ఎంతగానో ఆశగా ఎదురు చూశారు. అయితే ఈ మార్గం ఏర్పాటు చేసి దాదాపు ఏడు సంవత్సరాలు అయినా ఇప్పటి వరకు రైల్వే పరంగా ఒక రైలును (గూడ్స్ కాదు) వేయకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. పేరుకే జంక్షన్ మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ కల్పించాల్సిన అధికారులు ఉన్న రైళ్లను ఎత్తివేశారు. ఇది చాలా దారుణమని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

సముద్రం దగ్గర ఉన్నా దప్పిక తీరదు..

సముద్రం దగ్గర ఉన్నా దప్పిక తీరదు అన్న చందాన మారింది ఓబులవారిపల్లె మండల ప్రజల పరిస్థితి. రైల్వే శాఖ ముంబాయి – చెన్నై, తిరుపతి – కాచిగూడ, గుంటూరు మీదుగా ప్రస్తుతం ఉన్న రైళ్లతో పాటు అనేక ప్రత్యేక రైళ్ల నడిపిస్తోంది. నిత్యం ఈ మార్గం గుండా అన్ని ప్రాంతాలకు వెళ్లే రైళ్ల వెళ్తున్నా స్టాపింగ్ మాత్రం కల్పించడం లేదు. రాష్ట్ర రాజధానికి వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు కడప వరకే నడుస్తుంది. ఒక్క నిమిషం స్టాపింగ్ కల్పిస్తే రైల్వే శాఖకు ఎటువంటి నష్టం ఉండదు. అనేక రైళ్ల బిఫోర్ టైమ్‌లో వచ్చి రేణిగుంట, బాలపల్లె ఔటర్‌లో గంటల తరబడి నిలబడతాయి. రాజంపేట, రైల్వే కోడూరు, ఓబులవారిపల్లెలో రైల్వేశాఖ రెండు నిమిషాలు హాల్ట్ కల్పిస్తే కలిగే నష్టం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై అడిగే నాయకులు గానీ పట్టించుకునే అధికారులే లేరు.

రైల్వేశాఖ మంత్రి దృష్టికి..



రైళ్ల నిలుపుదల విషయంపై రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవలే గుంతకల్లులో నిర్వహించిన డీఆర్‌యూసీసీ మీటింగ్‌లో నేను కూడా ఓబులవారిపల్లె జంక్షన్‌లో రైళ్ల నిలుపుదలతోపాటు ఓబులవారిపల్లె – కృష్ణపట్నం మార్గంలో ప్యాసింజర్ రైళ్లు నడిపించాలని విన్నవించాను. ఇందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

– తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలి



ఓబులవారిపల్లె పేరుకే జంక్షన్, రైల్వే శాఖ వారు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా గతంలో ఎన్నడూ లేని విధంగా రైళ్ల తొలగించారు. టికెట్లు అమ్ముడుపోతున్నా రాజకీయ నాయకులు, రైల్వే శాఖ అధికారులు స్పందించి ప్రస్తుతం స్టాపింగ్ ఎత్తివేసిన హరిప్రియ, రాయలసీమలతో పాటు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ కల్పించి, ఇక్కడి వారికి మేలు చేయాలి.

– ఎస్పీ వెంకటసుబ్బారెడ్డి, రైతు, ఓబులవారిపల్లె

వైభవంగా అమ్మవారి జాతరలు



సుండుపల్లె: పాపన్నగారిపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

సుండుపల్లె : మండల పరిధిలోని వానరాచపల్లి బిడికి సమీపంలో వెలసిన మారెమ్మ తిరునాలలో ఆదివారం వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన పాపన్నగారిపల్లె గ్రామంలో వెలసిన ఏపూరమ్మ జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించారు. అనంతరం గ్రామస్తులతో మమేకమై వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, చిన్నగొల్లపల్లి సర్పంచ్ రామాజయచంద్ర, జిల్లా గిరిజన విభాగం అధ్యక్షుడు చంద్రనాయక్, రాజశేఖర్‌నాయక్, జేసీఎస్ కన్వీనర్ రెహమాన్‌ఖాన్, మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డితో పాటు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఓదివీడు జాతరలో రాజంపేట ఎమ్మెల్యే

వీరబల్లి : మండలంలోని ఓదివీడు పంచాయతీలో పెద్ద హరిజనవాడలో వెలసిన మాతమ్మ జాతరలో ఆదివారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్ర, జయచంద్ర, షాహీర్ బాషా, బివి రమణలు పాల్గొన్నారు. అలాగే ఓదివీడుకు చెందిన ఇమామ్ బాషా కుమారుడి వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డి, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవలందిస్తున్నాం



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ శివగంగిరెడ్డి

రాయచోటి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా మానవత సంస్థ ఆధ్వర్యంలో నిస్వార్థంగా సేవలు అందిస్తోందని రాయచోటి పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పెంచల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాల ఆవరణలో అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్ బాషా, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ సమాజంలో ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. రాయచోటి పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఒక నిరుపేద టైలర్ అయిన వెంకటేష్ కుమారుడు వెంకట్ శేకర్ ఎస్వీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. కాగా సంస్థ మండల నూతన అధ్యక్షుడిగా జయచంద్రారెడ్డి, సహకార కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కో- చైర్మన్ షకీల్, ఉపాధ్యక్షులు గంగాధర్ నాయుడు, మాజీ సెక్రటరీ వెంకట్రామరాజు, రామానాయుడు, సుదర్శన్ రెడ్డి, నాగేశ్వరావు (సన్నీ), టేకూరి నాగార్జున, పీరయ్య, శివరామకృష్ణ, ఈశ్వరయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు అందిస్తున్న డాక్టర్ శివక్రిష్ణ

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 62 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు రెయిన్‌షైన్ ఆసుపత్రి జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ఎస్.శివక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్పందన లభించిందన్నారు. శిబిరంలో 62 మందికి ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి మందలను అందజేశామన్నారు. శిబిరంలో అన్ని రకాల వ్యాధిగ్రస్తులను పరీక్షించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో చిన్న పిల్లలు, పురిటి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నవీన్‌కుమార్, రెయిన్ షైన్ ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం



గంగమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి : రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా వర్షాలు కురిపించి కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మకు వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మ ఆలయానికి భక్తులు తరలిరావడంతో క్యూలైన్లలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారి చిన్నపాటి జాతరను తలపించింది. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాది సంఖ్యలో వచ్చారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

ప్రతిభా పురస్కారాలు అందజేత



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న మానవత సభ్యులు

సుండుపల్లె : 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఆదివారం మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. నెలవారీ సమావేశంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథుగా సుండుపల్లె కెనరా బ్యాంకు మేనేజర్ మస్తాన్ పాల్గొని విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రాబోయే నెలలో చేయాల్సిన కార్యక్రమాల గురించి సంస్థ సభ్యులు చర్చించుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణంరాజు, డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి, కార్యదర్శి హరికుమార్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మోస్తరు భారీ వర్షం




వర్షంలో గొడుగు పట్టుకుని వెళ్తున్న చిన్నారులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎండాకాలం మే నెలలో వర్షాలు కురుస్తుండటంతో ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. గంటసేపు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది.

నేటి నుంచి మహబూబ్ సుబహాని ఉరుసు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం జెండామాను వద్ద హజరత్ మహబూబ్ సుబహాని 79వ ఉరుసు ఉత్సవం మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు ఉత్సవం జరుగుతుందని చెప్పారు. మంగళవారం, బుధవారం రాత్రి ఖవ్వాలీ, పాటల కచ్చేరి ఉంటుందని తెలిపారు. హిందూ ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి నిమ్మలతో ఏపీ ఎన్జీఓ నాయకులు

కడప రూరల్ : ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. ఆదివారం స్థానిక ఇరిగేషన్ అతిథి గృహంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును ఎన్జీఓ అసోషియేషన్ నేతలు కలిసి, ఆయనను సన్మానించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులు ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం కడప నగర కార్యదర్శి సైలేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పద్మనాభం, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

‘మహానాడుతో ప్రజల ప్రాణాలకు పెనుముప్పు’



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి నాయకులు

రాజంపేట రూరల్ : కడపలో మహానాడు నిర్వహిస్తే రాష్ట్ర ప్రజల ప్రాణాలకు పెనుముప్పు వాటిల్లుతుందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.జుబేద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులతో కలిసి జుబేద్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలో కరోనా కొత్త వేరియంట్‌తో ముంచుకొస్తుంటే ప్రజలు ప్రాణభయంతో వణికిపోతున్నారన్నారు. ఇటువంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టి మహానాడు నిర్వహణకు పూనుకోవటం ఎంతమటుకు సమంజసమని ప్రశ్నించారు. ఇదివరకే కడపలో ఒక కరోనా కేసు నమోదైన సమయంలో ఇలాంటి బాధ్యతగా వ్యవహరించాల్సిన ప్రభుత్వ పెద్దలే ఇలా భారీ సమావేశాన్ని నిర్వహించడం భావ్యం కాదన్నారు. గోదావరి పుష్కరాలు, కందుకూరు సభలలో ప్రజల ప్రాణాలను బలిగొన్న బాబు బృందానికి ఇంకా దాహం తీరకనే మహానాడుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. మహానాడు ఏర్పాట్లను టీడీపీ నాయకుల కన్నా జిల్లా అధికారులే దగ్గరుండి పర్యవేక్షిస్తుండటం బాధిస్తోందన్నారు. ఇంతటి అధికార దుర్వినియోగం గతంలో చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టుతూ నిర్వహిస్తున్న ఈ మహానాడు దగానాడు అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నూకా సునీల్‌రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కార్యదర్శి కదిరి కల్యాణ్‌కుమార్, వలంటీర్స్ వింగ్ మండల అధ్యక్షులు బుర్రు శివకుమార్, మున్సిపాలిటీ విద్యార్థి విభాగం అధ్యక్షులు కదిరి బాలిరెడ్డి, నాయకులు ముప్పవరం రమణయ్యనాయుడు, మహంకాళీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 1993 – 94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకగా సాగింది. 30 సంవత్సరాలు తరువాత కలుసుకున్న విద్యార్థులు ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనగా పలుకరింపులు, ఆత్మీయ ఆలింగనాలతో కార్యక్రమం సందడిగా సాగింది. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ఆనాటి ఉపాధ్యాయ బృందాన్ని పూర్వ విద్యార్థులు బాణసంచా వెలుగులు, వేదమంత్రాల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరణించిన ఉపాధ్యాయులు, విద్యార్థులను గుర్తు చేసుకొని వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయురాలు పి.వెంకట లక్ష్మమ్మ అధ్యక్షత వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతిని కోరుకునే ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులకు ఎనలేని గౌరవం ఉంటుందన్నారు. అంతటి గౌరవాన్ని అందిస్తున్న ఆనాటి విద్యార్థులకు వారు ఆశీస్సులు అందించారు. తదుపరి ఉపాధ్యాయులు బాలమ్మ, సాంబశివారెడ్డి, నారాయణరెడ్డి, గోపికృష్ణ, విజయకుమార్, రాజంపేట మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, వైసీ సుబ్బరాయుడు, భారతీ తదితర ఉపాధ్యాయులు మాట్లాడి విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, నాగరాజు, గణేష్, పెంచలయ్య, సుబ్బరామిరెడ్డి, మురళీరెడ్డి, బాల త్రిపుర సుందరీ, గౌసియా, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

29 మంది కంటి రోగులకు ఆపరేషన్‌లు



రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయచోటి జగదాంబ సెంటర్ : రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్యశిబిరంలో 29 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించినట్లు ఆసుపత్రి చైర్మన్ స్వరూప్ గుప్తా తెలిపారు. రాయచోటి నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల నుండి వచ్చిన 60 మంది కంటి రోగులకు వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, అప్తమాలిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు అందజేశారు. కంటి రోగుల సౌకర్యార్థం దాతలు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని ఆదివారం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణ గావించి గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమంటపంలో సేద తీరిన వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈయన వెంట ఒంటిమిట్ట ఆర్యవైశ్య చైర్మన్ సామిశెట్టి మనోహర్ బాబు, రెంటాల వెంకట లోకేష్ తదితరులు ఉన్నారు.

మెగా బైబిల్ ఎగ్జిబిషన్ సేల్

కడప కోటిరెడ్డి సర్కిల్ : నగరంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మెగా బైబిల్ ఎగ్జిబిషన్ సేల్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు రవికుమార్ సుభాషిని ఒక ప్రకటనలో తెలిపారు. రాజారెడ్డి వీధిలోని కృపా చర్చిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7:00 వరకు ఈ మెగా బైబిల్ సేల్ నిర్వహిస్తుమని పేర్కొన్నారు. మార్కెట్ ధరల కన్నా అతి తక్కువ ధరలలో బైబిల్లో అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే 50 రకాల బైబిలు నిఘంటువులు, కంజర్లు తదితర వాటిని అందుబాటులో ఉంచామన్నారు.